విద్యుత్ ప్రజావాణికి స్పందన

- సర్కిల్, డివిజన్ కార్యాలయాల్లో 20 ఫిర్యాదులు స్వీకరణ

వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్ఈ గంగాధర్

ముకరంపుర, జూన్ 17: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఎన్పీడీసీఎల్ నిర్వహిస్తున్న విద్యుత్ ప్రజావాణి కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ సోమవారం కార్యక్రమాన్ని ప్రారంభించి, వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సీజీఎం రాజీవ్ హన్ ఫిర్యాదుల స్వీకరణ తీరును పరిశీలించారు. వినియోగదారుల నుంచి వివిధ సమస్యలపై సర్కిల్ కార్యాలయంలో ఏడు ఫిర్యాదులు, కరీంనగర్ టౌన్, కరీంనగర్ రూరల్, హుజూరాబాద్ మొత్తం మూడు డివిజన్లలో కలిపి 13ఫిర్యాదులు వచ్చాయి. సర్కిల్ కార్యాలయంలో స్వీకరించిన ఫిర్యాదుల తక్షణ పరిష్కారం కోసం సంబంధిత సెక్షన్లకు పంపించినట్లు ఎస్ఈ తెలిపారు. డీఈ రాజం, ఎస్ఏవో రాజేశం, ఏవో అరవింద్, పీవో చంద్రయ్య, ఏడీఈలు లావణ్య, స్వప్న, వీణ, పండరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి

శంకరపట్నం, జూన్ 17: నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారి 563పై ప్రమాదాలను అరికట్టాలని కొత్తగట్టు గ్రామానికి చెందిన న్యాయవాది, సామాజిక ఉద్యమకారుడు బానాల శ్యాంసుందర్ పోలీసులను కోరారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారిపై ఎల్కతుర్తి మండలం పెంచికలపేట నుంచి శంకరపట్నం మండలం తాడికల్ వరకు ఇటీవల తరచూ ప్రమాదాలు జరుగుతుండడం ఆందోళనకు గురి చేస్తున్నదన్నారు. రహదారి నిర్మాణం కోసం వినియోగిస్తున్న టిప్పర్లు, భారీ గ్రానైట్ లోడ్ వాహనాలు అతి వేగంగా, అజాగ్రత్తగా వెళ్లడం వల్ల రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌తో పాటు ఇసుక లారీలు, ట్రాక్టర్లను తనిఖీలు చేసే పోలీసులు, రహదారి నిర్మాణ పనుల్లో వినియోగిస్తున్న వాహనాల విషయంలో ఎందుకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ ఇప్పటికైనా ఈ విషయంపై దృష్టి సారించి ప్రమాదాల నివారణకు నడుం బిగించాలని కోరారు.

పేద విద్యార్థికి ఎమ్మెల్యే ఆపన్నహస్తం

శంకరపట్నం, జూన్ 17: మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఓ పేద విద్యార్థికి ఆపన్నహస్తం అందించారు. శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన గొర్రె అజయ్ కేరళలోని కాళికట్ ఎన్ ఐటీలో సెకండ్ సెమిస్టర్ చదువుతున్నాడు. వీరిది పేద కుటుంబం కావడంతో పరీక్ష ఫీజు కట్టే ఆర్థిక స్థోమత కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తేగా, వెంటనే స్పందించిన ఆయన సోమవారం విద్యార్థి కుటుంబాన్ని క్యాంపు కార్యాలయానికి పిలిపించుకున్నారు. రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. అంతేకాక చదువు పూర్తయ్యే వరకు అన్ని విధాలా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థికి సూచించారు. అజయ్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలి

హుజూరాబాద్ రూరల్, జూన్ 17: రైతులకు ఎలాంటి షరతులు లేకుండా ఆగస్టు 15లోగా రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని హుజూరాబాద్ సింగిల్ విండో చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎడవెల్లి కొండల్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2018 డిసెంబర్ 12 నుంచి తీసుకున్న రుణాలను మాఫీ చేస్తూనే తిరిగి కొత్త రుణాలను అందజేయాలని కోరారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ఉద్యమాలకు పూనుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

జమ్మికుంట: బక్రీద్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

మానకొండూర్ : ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

ఘనంగా బక్రీద్ వేడుకలు

- ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
- వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు

రేకుర్తి సాలెహ్‌నగర్ ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కమాన్‌చౌరస్తా/ జమ్మికుంట/ హుజూరాబాద్ రూరల్/ మానకొండూర్/ శంకరపట్నం/ కరీంనగర్ రూరల్/ సైదాపూర్/ వీణవంక, జూన్ 17 : త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పర్వదిన వేడుకలను సోమవారం జిల్లా వ్యాప్తంగా ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. నగరంతో పాటు గ్రామాలు, మండల కేంద్రాల్లోని మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రేకుర్తి సాలెహ్‌నగర్, కళాభారతి వద్ద, బైపాస్ రోడ్, చింతకుంటలో గల ఈద్గాల్లో ప్రార్థనలకు పెద్ద సంఖ్యలో ముస్లింలు తరలివచ్చారు. సాలెహ్ నగర్ సదర్ ఖాజీ మన్ ఖబత్ షా ఖాన్ నమాజ్ చేయించగా, మత పెద్ద ఈద్గా ఖతీబ్ ముఫ్తి మహ్మద్ ఘియాస్ మెహియుద్దీన్ సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ షమీ, హఫీజ్ సయ్యద్ మెయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్, ఎంఐఎం కార్పొరేటర్లు, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ మేయర్ క్యాంపు కార్యాలయంలో మేయర్ సునీల్‌రావును పలువురు ముస్లింలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వారికి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. మానకొండూర్, శంకరపట్నం, కరీంనగర్‌రూరల్, సైదాపూర్, వీణవంక, హుజూరాబాద్ మండలాల్లోని ఈద్గాల వద్ద ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా ముస్లింలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఒకరికొకరు అలాయ్‌బలాయ్ తీసుకుంటు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి ఈద్గా వద్ద బక్రీద్ వేడుకల్లో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పాల్గొన్నారు. ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, గుల్జార్ మసీద్ అధ్యక్షుడు మీర్ అహ్మద్ హుస్సేన్, పలువురు వార్డు కౌన్సిలర్లు, నాయకులు, తదితరులున్నారు. మానకొండూర్‌లోని ఈద్గా వద్ద ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మతపెద్దలు, ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

సేవా కార్యక్రమాల్లో ఆదర్శంగా నిలువాలి

చొప్పదండి లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపడుతున్న మహేశుని మల్లేశం

చొప్పదండి, జూన్ 17: సామాజిక సేవా కార్యక్రమాల్లో చొప్పదండి లయన్స్ క్లబ్ ఆదర్శంగా నిలువాలని జిల్లా 320జీ మొదటి ఉప గవర్నర్ లయన్ సింహరాజు కోదండరాం పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండి 2024-25 సంవత్సరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం సోమవారం లయన్స్ భవన్‌లో నిర్వహించగా, కార్యక్రమానికి ముఖ్య అతిథి, ఇన్‌స్టలేషన్ ఆఫీసర్‌గా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా క్లబ్ నూతన అధ్యక్షుడిగా మహేశుని మల్లేశం, కార్యదర్శిగా మామిడి రాజేశ్ పవార్, కోశాధికారిగా తొడుపునూరి సత్యనారాయణ, మొదటి ఉపాధ్యక్షుడిగా వల్లాల జగన్, ఎల్‌సీఐఎఫ్ క్లబ్ కోఆర్డినేటర్‌గా నలుమాచు సుధాకర్, క్లబ్ కమ్యునికేషన్, మార్కెటింగ్ చైర్మన్‌గా సిరిపురం రాజు, దూస రాము, క్లబ్ సర్వీస్ చైర్మన్‌గా కొల్లూరి జితేందర్, క్లబ్ మెంబర్షిప్ చైర్మన్‌గా పెద్ది లక్ష్మీకాంతం, ఎల్‌సీఎఫ్ క్లబ్ కోఆర్డినేటర్‌గా తొడుపునూరి లక్ష్మయ్య, ఐ బాల్ సర్వీస్ కో ఆర్డినేటర్‌గా చింతల రవి, జాయింట్ సెక్రటరీగా తాటిపెల్లి శివకుమార్, క్లబ్ డైరెక్టర్స్‌గా మోర భద్రేశం, కొల్లూరి ఆనందం, వల్లాల కృష్ణహరి, తాటికొండ శ్రీనివాస్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్‌లో నూతనంగా చేరిన తొమ్మిది మంది నూతన సభ్యులతో రీజియన్ చైర్మన్ తన్నీరు రాజేందర్ ప్రమాణం (ఇండక్షన్) చేయించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ, చొప్పదండి లయన్స్ క్లబ్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి జిల్లాలోనే అత్యుత్తమ క్లబ్‌గా గుర్తింపు పొందిందని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా 320 జీ రెండో ఉప గవర్నర్ మోర భద్రేశం, డీసీటీ ఇరుకుల్ల ఆనంద్, అడిషనల్ సెక్రటరీ డేగ బాబు, రీజియన్ చైర్మన్ తన్నీరు రాజేందర్, జోన్ చైర్మన్ కామని శ్రీనివాస్, క్లబ్ సభ్యులు గుర్రం విలాస్ రెడ్డి, గొల్లపెల్లి నరేశ్ పాల్గొన్నారు.

ఖేలో ఇండియా పోటీల్లో కరీంనగర్ క్రీడాకారిణికి రజతం

కొత్తపల్లి, జూన్ 17 : కర్ణాటక రాష్ట్రంలోని బీవీవీ సంఘ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 10 నుంచి 13 వరకు నిర్వహించిన ఖేలో ఇండియా సౌత్‌జోన్ ఉషూ ఉమెన్స్ పోటీల్లో కరీంనగర్‌కు చెందిన సీనియర్ క్రీడాకారిణి అద్భుత ప్రతిభ చూపి రజత పతకం సాధించింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో తెలంగాణ నుంచి పాల్గొన్న కరీంనగర్‌కు చెందిన జీనత్ అంజూమ్ సాన్ షా 60 కేజీలో విభాగంలో పాల్గొని పతకం గెలుపొందింది. ప్రతిభ చూపిన క్రీడాకారిణిని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉషూ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బార విద్యాసాగర్, సీనియర్ ఉషూ కోచ్ మొయిన్ అహ్మద్ అభినందించారు.

జీనత్ అంజూమ్‌ను అభినందిస్తున్న ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

నేడు కేవీకేలో కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమం

జమ్మికుంట, జూన్ 17: కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మంగళవారం 17వ విడుత ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి విడుదల కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం జమ్మికుంట పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ వెంకటేశ్వర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3నుంచి 7గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి కేంద్ర జలశక్తి, రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న హాజరవుతారని, భారీ సంఖ్యలో రైతులు పాల్గొనాలని కోరారు.

ఏపీ ఉద్యోగులను అనుమతించొద్దు

కలెక్టరేట్, జూన్ 17 : ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగులు తెలంగాణ సచివాలయానికి బదిలీ చేసుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కే రామస్వామి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆ సంఘం ఉమ్మడి జిల్లా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, విభజన చట్టం నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్ర స్థానికత కలిగినవారిని తెలంగాణకు కేటాయించారని వెల్లడించారు. విభజన చట్టం పంపకాల కనుగుణంగా, వ్యవహరించాల్సిన అధికారులు అదనంగా మరో వంద మందిని కేటాయించడం సముచితమేనా అని ప్రశ్నించారు. రెండు రాష్ట్రాల మధ్య 42:58 నిష్పత్తి పాటించాల్సి ఉన్నా, అది 13:87గా మారిందన్నారు. మూడు కీలక హోదాల్లో పనిచేస్తున్న ఏపీ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వంలో చేరడానికి అనుమతి ఇవ్వడం ద్వారా ఇక్కడ ఉద్యోగోన్నతుల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పష్టమైన ప్రకటన చేయకుంటే, మరో ఉద్యమానికి నాంది పలుకాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో సంఘ నాయకులు రావుల రాజకుమార్, అల్లాడి ప్రదీప్ కుమార్, మేకల సుదర్శన్, హైదుగుల వెంకటేశం, సదాశివరావు, పేట రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మేముగంటి రామారావు మృతికి నాయకుల నివాళి



నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కార్పొరేషన్, జూన్ 17: కరీంనగర్‌కు చెందిన వేముగంటి రామారావు మరణించగా, భౌతిక కాయానికి సోమవారం మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జడ్పీ వైస్ చైర్మన్ పేరాల గోపాల్ రావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాంరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేముగంటి రామారావు, నవోదయ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్‌గా, ఉత్తరాంచల్ ప్రభుత్వ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ సలహాదారుగా పనిచేశారు. కరీంనగర్‌లో పీజీ సెంటర్ పెట్టడంలో కీలక పాత్ర పోషించారు. నవోదయ స్కూల్స్ అభివృద్ధికి కృషి చేశారు.

నేడు 'ఫ్లాష్‌బ్యాక్ సమ్మిట్ 2024'

విద్యానగర్, జూన్ 17: ఫ్లాష్‌బ్యాక్ ఏ1 ఆధారిత ప్రొఫెషల్ వెడ్డింగ్ ప్రోడక్ట్ ఫ్లాష్‌బ్యాక్ ప్రోమోను మంగళవారం కరీంనగర్‌లోని కమాన్‌రోడ్‌లో గల హోటల్ పికాక్ రెస్టారెంట్‌లో ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సమ్మిట్‌ను తెలుసుకోవడానికి 250 మంది కంటే ఎక్కువ ప్రొఫెషనల్ ఫొటో గ్రాఫర్లు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఫ్లాష్‌బ్యాక్ అనేది కరీంనగర్ ఆధారిత ఏ1 స్టార్టప్ అని, వివాహ పరిశ్రమలను ప్రభావితం చేసే ఒకరకమైన సోషల్ మీడియా అని వారు తెలిపారు. ఫ్లాష్‌బ్యాక్‌ను బూట్ స్ట్రాప్ చేయడానికి స్థాపించినట్లు పేర్కొన్నారు.

వైభవంగా నిర్జల ఏకాదశి ఉత్సవం

పూజల్లో పాల్గొన్న భక్తులు

కమాన్‌చౌరస్తా, జూన్ 17 : జిల్లా కేంద్రంలోని తిరుమలనగర్‌లోని మయూరగిరి పీఠం శ్రీ నిలయంలో జ్యేష్ఠ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని నిర్జల ఏకాదశి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. మయూరగిరి పీఠాధిపతి, జ్యోతిష వాస్తు పండితుడు నమిలకొండ రమణాచారి స్వామి ఆధ్వర్యంలో ఉదయం నుంచి లక్ష్మీనారాయణ హోమాలు, స్వామికి అభిషేక అర్చనలు, సామూహిక విష్ణు సహస్రనామ, హనుమాన్ చాలీసా పారాయణాలు జరిగాయి. కార్యక్రమంలో రామకృష్ణమాచార్యులు రమేశ్ స్వామి, పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

వేడినీళ్లు మీద పడి వృద్ధుడి మృతి

రాంనగర్, జూన్ 17: ప్రమాదవశాత్తు వేడినీళ్లు మీద పడడంతో తీవ్రగాయాలపాలైన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. రామగిరి యాదగిరి భార్య భాగ్యలక్ష్మితో కలిసి నగరంలోని సప్తగిరి కాలనీలో ఉంటున్నాడు. ఈ నెల 7న యాదగిరి స్నానం చేసేందుకు నీళ్లు వేడి చేసుకుని తీసుకువెళ్తుండగా, ప్రమాదవశాత్తు కాలుజారి పడ్డాడు. వేడి నీళ్లు ముఖం, శరీరంపై పడి బొబ్బలు రావడంతో కుటుంబ సభ్యులు ముందుగా కరీంనగర్‌లోని ప్రభుత్వ దవాఖానకు, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యాదగిరి (64) సోమవారం మృతి చెందాడు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ విజయ్ కుమార్ తెలిపారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం

వీణవంక, జూన్ 17: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు సోమవారం ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి బహుమతులు అందజేశారు. మండల కేంద్రంలో పది రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన విన్నర్ జట్టుకు రూ.10 వేలు, రన్నరప్ జట్టుకు రూ.5 వేలు చొప్పున ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి స్పాన్సర్ చేయగా, ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి ట్రోఫీలతో పాటు అందజేశారు. క్రీడలతో శారీరక, మానసికోల్లాసంతో పాటు ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ కామిడి కావ్య-శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వోరెం భానుచందర్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు తాళ్లపెల్లి మహేశ్, సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీణవంకలో క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న నాయకులు

నమస్తే తెలంగాణ CLASSIFIED

EDUCATION

★రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed., B.Ed., B.P.Ed., MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. *4 నెలల్లో పరీక్షలు. 8866977112, 339.

NT-333727

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571

91827 77194

బీసీల హక్కుల సాధనకు పోరాటం

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కని సంజయ్ కుమార్



జక్కని సంజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

హుజూరాబాద్ రూరల్, జూన్ 17: బీసీల హక్కుల సాధన కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమేనని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కని సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఇటీవల బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా సోమవారం పట్టణంలో నిర్వహించిన సన్మాన సభకు ఆయన హాజరై మాట్లాడారు. గ్రామ గ్రామాన బీసీలను కలుస్తూ సంఘటిత పరుస్తూ రాజ్యాధికార దిశగా కార్యోన్ముకులను చేయడమే తన ముందున్న ప్రధాన కర్తవ్యమని తెలిపారు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యం ఇవ్వాలని, బీసీలను ఓటు బ్యాంకుగా చూసే విధానం పోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీసీ రాజకీయ పోరాట సమితి అసెంబ్లీ అధ్యక్షుడు చిలుకమారి శ్రీనివాస్, హుజూరాబాద్, వీణవంక మండలాధ్యక్షులు పంజాల తిరుపతి గౌడ్, వడ్డేపల్లి రాజగోపాల్, యువజన విభాగం రాష్ట్ర నాయకులు బోయినపల్లి సాయిచంద్, బీసీ నాయకులు సంగెం సత్యనారాయణ. శ్రవణ్, సాయి, వీరబోయిన వేణు, న్యాలి కుమార్, పల్లె బోయిన రాజు కుమార్, రాజకొమురయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం బీసీ రాజకీయ పోరాట సమితి అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శిగా కూరపాటి రామచంద్రం, మండల ప్రధాన కార్యదర్శిగా కోమటి శ్రీనివాస్‌ను నియమిస్తూ బీసీ రాజకీయ పోరాట సమితి అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు చిలుకమారి శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు.

కేసీఆర్‌తో సురేశ్

కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకుడు

గన్నేరువరం, జూన్ 17: తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ఎర్రవల్లిలోని నివాసంలో సోమవారం బీఆర్ఎస్ యువజన విభాగం మానకొండూర్ నియోజకవర్గ అధ్యక్షుడు గూడూరి సురేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గూడూరి సురేశ్ మాట్లాడుతూ, పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అనేక సంక్షేమ కార్యక్రమాలు ఇప్పటికే ప్రజల గుండెల్లో నిలిచిపోయాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కేసీఆర్ సూచించినట్లు ఆయన తెలిపారు.

భార్యతో గొడవపడి ఉరేసుకొని ఆత్మహత్య

- పోస్టుమార్టం వద్ద స్వల్ప ఉద్రిక్తత

రాంనగర్ జూన్ 17: మద్యానికి బానిసైన యువకుడు భార్యతో గొడవపడి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం.. కరీంనగర్ మండలం తీగలగుట్టపల్లి చంద్రపురం కాలనీకి చెందిన వల్లెపు స్వామి (32) తన కులవృత్తి అయిన వడ్డెర పని (మట్టి పని) చేసుకొని జీవనం కొనసాగిస్తున్నాడు. మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడేవాడు. శనివారం ఆయన భార్య స్వాతి పిల్లలతో కలిసి పిల్లలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాల గురించి కొత్తగూడెం(గతంలో నివాసం ఉన్న ప్రాంతం)కు వెళ్లి తిరిగి వచ్చింది. ఆదివారం రాత్రి అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చిన స్వామి, కొత్తగూడెంలోని స్వాతి పుట్టింట్లో ఉంచిన సామానులు ఎందుకు తీసుకురాలేదని ఆమెతో గొడవపడి తీవ్రంగా కొట్టాడు. ఎదురు ఇంట్లోకి వెళ్లి కూడా గొడవ పడ్డాడు. ఆ రాత్రి తన ఇంట్లో ఒక్కడే ఉండి తన దగ్గర బంధువులైన వల్లెపు ప్రశాంత్, వల్లెపు శ్రీధర్‌కు వాట్సాప్ కాల్ చేసి, జీవితంపై తనకు విరక్తి కలిగిందని, అందుకే చనిపోతున్నానని వారికి తెలిపాడు. కాగా, స్వామి ఇంట్లో వెంటిలేటర్‌కు తాడుతో ఉరేసుకొన్నట్లు గ్రహించిన అదే కాలనీకి చెందిన శివరాత్రి వెంకటేశ్.. స్వాతికి సమాచారం ఇచ్చాడు. ఆమె వచ్చి చూసే సరికి ఉరికి వేలాడుతూ చనిపోయి కనిపించాడు. కాగా, భార్యతో గొడవ పడి స్వామి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని, అతడి మృతిపై తనకు అనుమానం ఉన్నదని, సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని మృతుడి తండ్రి జంపయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ ప్రదీప్ తెలిపారు. కాగా, దవాఖానలో పోస్టుమార్టం ముగిసిన అనంతరం ఇరువర్గాల బంధువులు మృతదేహాన్ని తమకే అప్పగించాలంటూ గొడవపడ్డారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకోగా, రంగంలోకి దిగిన పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వెన్కేపల్లిలో ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

సైదాపూర్, జూన్ 17: మండలకేంద్రంలోని వెన్కేపల్లి జడ్పీహెచ్ఎస్‌లో 2001-02, ఎక్లాస్‌పూర్ జడ్పీహెచ్ఎస్‌లో 2005-06 ఎస్ఎస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాల ప్రదానం అనంతరం విద్యార్థులతో గోపా బాధ్యులు

లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలి

- గౌడ సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్
- టెన్త్, ఇంటర్‌లో ప్రతిభచూపిన విద్యార్